క్లుప్తంగా

మే ఐ హెల్ప్ యూ!


పోలింగ్ కేంద్రాల వద్ద సేవలు అందిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఉరవకొండ: పట్టణంలోని ఎస్కే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ, పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అద్భుతంగా సేవలు అందించారు. ఓటర్లకు పోలింగ్ బూత్‌లకు వెళ్లే దారి చూపించడమే కాకుండా, వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను భద్రంగా ఉంచి.. ఓటు వేసిన అనంతరం అప్పగించారు. బాలింతలు వలంటీర్ల వద్ద చిన్నపిల్లలను వదిలి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఓటర్లకు ఉచితంగా మాస్కులు, శానిటైజర్లు అందించారు. వలంటీర్ల సేవలను ఉపాధ్యాయులు, పట్టభద్రులు కొనియాడారు.

నేడు నులిపురుగుల నివారణ కార్యక్రమం

శెట్టూరు: మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ సోమవారం తెలిపారు. మండలంలో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకూ సుమారు 6 వేల మంది విద్యార్థులున్నారన్నారు. మంగళవారం మధ్యాహ్నం భోజనం తరువాత వారికి ఆల్‌బెండజోల్ గులికలు వైద్య సిబ్బంది సమక్షంలో అందజేస్తామన్నారు.

వలంటీర్ జ్ఞాపకార్థం అన్నదానం

కూడేరు: మండలంలోని శివరాంపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత వెంకటేష్ కుమారుడు శ్రీకాంత్(గ్రామ వలంటీర్) మూడేళ్ల క్రితం మృతి చెందాడు. శ్రీకాంత్ జ్ఞాపకార్థం మండలంలోని గొటుకూరులో ఉన్న బేరాక్ వృద్ధాశ్రమంలో సోమవారం రాత్రి తండ్రి వెంకటేష్ వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రతి ఏటా శ్రీకాంత్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మధు, మధుసూదన్,శివయ్య, పక్కీరప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు కూలీలకు గాయాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): బళ్లారి– బెంగళూరు జాతీయ రహదారిపై డి హీరేహాళ్ మండల కేంద్రం సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రం రాంపురం మండలం పైకనుమ గ్రామానికి చెందిన కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారి సమీపాన లక్ష్మీనగర్ క్యాంపు కూలి పనుల కోసం వెళ్లి ఆటోలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. డి హీరేహాళ్ సమీపానకు రాగానే వేగంతో వచ్చిన ఆటో రోడ్డు డివైడర్‌ను తగిలి ముందుగా వెళుతున్న కూల్‌డ్రింక్స్ లగేజీ ఆటోను ఢీ కొట్టింది. ఘటనలో ఆటో రెండు పల్టీలు కొట్టగా, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను బళ్లారి విమ్స్ తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

అగ్నికి ఆహుతైన మొక్కజొన్న

గుమ్మఘట్ట: మండలంలోని మారెంపల్లి సమీపంలో రెండున్నర ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట సోమవారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు గురుస్వామి తెలిపిన వివరాల మేరకు.. రెండున్నర ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట కాలం పూర్తి కావడంతో మొక్కజొన్న కంకులను తొలగించి పొలంలో ఆరబెట్టాడు. కూతురికి సీమంతం చేయాలని పిలుచుకుని రావడానికి కళ్యాణదుర్గం సమీపంలోని బోయలపల్లికి కుటుంబసభ్యులతో కలసి ఆదివారం ఉదయం వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించడంతో కాలిబూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నాడు. అధికారులు స్పందించి బాధిత రైతుకు పరిహారం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పొలం తగాదాతో అన్నదమ్ముల ఘర్షణ

బొమ్మనహాళ్: మండలంలోని కానాపురం గ్రామంలో పొలం తగదాతో అన్నదమ్ములు ఘర్షణ పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల రంగప్ప, రాజేష్ అన్నదమ్ములు. వీరు కొంతకాలంగా భూతగాదాలతో గొడవ పడుతుండేవారు.. సోమవారం కూడా భూతగాదాల విషయంలో మాట మాటా పెంచుకుని ఘర్షణకు దారితీసింది.తమ్ముడు రాజేష్‌పై రంగప్ప దాడి చేసి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టామని ఎస్ఐ శివ తెలిపారు.

జోడు లింగాలకు విశేష పూజలు

కూడేరు: మండల కేంద్రంలో శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత జోడు లింగాలకు క్షీరాభిషేకం ,రుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జోడు లింగాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం


రాయదుర్గం: కుటుంబ సభ్యులతో కలసి ఓటుహక్కును వినియోగించుకున్న విప్ కాపు రామచంద్రారెడ్డి


కళ్యాణదుర్గం: ఓటు వినియోగించుకుంటున్న రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్


ఉరవకొండ: ఓటరు స్లిప్పులు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప

- పోలింగ్ శాతం భారీగా నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి ఉషశ్రీచరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ
- రాయదుర్గంలో టీడీపీ నేతల ఓవరాక్షన్
- దొంగ ఓటుతో పట్టుబడ్డ ఉపాధ్యాయుడు

రాయదుర్గం సాక్షి బృందం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్‌తో పాటు డి హీరేహాళ్, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటల వరకూ కొనసాగింది. మొత్తం 12 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా వీటిలో 6,137 మంది పట్టభద్రులకు 4,884 ఓట్లతో 79.58 శాతం, 345 మంది ఉపాధ్యాయులకు 333 ఓట్లతో 96.52 శాతం ఓటింగ్ నమోదైందని కళ్యాణదుర్గం ఆర్డీఓ నిషాంత్‌రెడ్డి, డీఎస్పీ బీ శ్రీనివాసులు తెలిపారు. బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత నడుమ అనంతపురం స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓ ఉపాధ్యాయుడు దొంగ ఓటువేసేందుకు వెళ్లి ఏజెంట్లకు పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

టీడీపీ నాయకుల ఓవరాక్షన్..

అధికారం లేకపోయినా టీడీపీ నేతల ఓవరాక్షన్ మాత్రం తగ్గడం లేదు. అనవసరంగా పోలింగ్ బూత్‌లలోకి వెళ్లరాదని అడ్డు చెప్పిన సీఐ యుగంధర్, ఎస్ఐ సుమన్‌పై ఆ పార్టీ యుత్‌నాయకుడు మురళి చిందులు తొక్కారు. దీంతో కాసేపు పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి తలెత్తింది. సర్దిచెప్పి పక్కకు తీసుకెళ్లాల్సింది పోయి పచ్చ నాయకులు కొందరు కావాలనే రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ గొడవకు మరింత ఆజ్యం పోశారు. దీంతో నానాయాగీ చేసి పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. చివరకు అరెస్టుదాకా దారితీసింది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు పంపకాల్లో వచ్చిన తేడా విషయమై కొందరు టీడీపీ నాయకులు బహిరంగానే విమర్శలకు దిగడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

ఓటేసిన విప్ కాపు కుటుంబం

పట్టణంలోని రాధాకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, తనయుడు ప్రవీణ్‌రెడ్డి, కోడలు అలేఖ్యరెడ్డి, కుమార్తె శ్రవంతిరెడ్డి క్యూలైన్‌లో వెళ్లి ఓటుహక్కును సద్వినియోగం చేసుకున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైస్ చైర్మెన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాష, పట్టణ కన్వీనర్ ముస్తాక్, పార్టీ నాయకుడు పొరాళ్ల శివ, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు ఓటు వేశారు. ఈ సందర్భంగా విప్ కాపు విలేకర్లతో మాట్లాడారు.. రాష్ట్ర వ్యాప్తంగా అందుతున్న పోలింగ్ సమాచారం బట్టి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బహ్మాండమైన మెజార్టీ తో విజయం సాధిస్తారన్నారు. రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా వైఎస్సార్‌సీపీ మద్దతుతో బరిలో నిలిచిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఓటమిని ముందే పసిగట్టి జీర్ణించుకోలేక నానాయాగీ సృష్టిస్తున్నారని, పోలీసులపైనే దౌర్జన్యాలకు దిగడం సరైన పద్ధతి కాదని ఖండించారు. అనంతరం విప్ గుమ్మఘట్ట, కణేకల్లు, డి హీరేహాళ్‌లో పర్యటించి పోలింగ్ సరళి తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డితో పాటు తహసీల్దార్ మారుతి, అన్నీ మండలాల ఎన్నికల అధికారులు సకాలంలో పోలింగ్ నిర్వహణకు చర్యలు చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో పటిష్ట పోలీసు భద్రత నిర్వహించారు.

▸▸ బొమ్మనహాళ్ మండలంలో 83.18 శాతం పోలింగ్ నమోదయిన్నట్లు పోలింగ్ ఆఫీసర్ మురళికృష్ణ , తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

▸▸ కణేకల్లు మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కణేకల్లుకు వచ్చిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పోలింగ్ సరళి గురించి మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టి.కేశవరెడ్డి, కార్యదర్శి ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకొన్నారు. తహశీల్దార్ రజాక్‌వలీ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించగా ఎస్ఐ దిగ్గిరెడ్డి నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.79.23 శాతం పోలింగ్ నమోదైంది.

▸▸ గుమ్మఘట్ట మండలంలో పట్టభద్రులకు సంబంధించి 85.82, ఉపాధ్యాయులకు సంబంధించి 93.75 శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ సాక్షి బృందం: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సోమవారం సజావుగా సాగింది. ఉరవకొండ పట్టణంలోని ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రంతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టభద్రులకు సంబంధించి అర్బన్, రూరల్ పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటలకు ప్రారంభం అయిన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 166వ పోలింగ్ కేంద్రంకు వెళ్లి ఓటర్లతో పాటు క్యూలైన్‌లో నిల్చుని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా పట్టభద్రుల పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 4 గంటలు దాటినా దాదాపు 200 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరడంతో సాయంత్రం 5.30 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. మండలంలో పట్టభద్రులకు సంబంధించి 74 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 92 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ, ఆర్డీఓ

ఉరవకొండ పట్టణంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప, ఆర్డీఓ రవీంద్ర తనిఖీ చేశారు. క్యూలైన్లో నిల్చున్న ఓటర్లతో మాట్లాడి, బందోబస్తుపై సీఐ హరినాథ్‌తో చర్చించారు. తహసీల్దార్ సయ్యద్‌షాబుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ గురుప్రసాద్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఈడీటీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

▸▸ బెళుగుప్ప మండలంలో ఉపాధ్యాయలకు సంబంధించి 100 శాతం పోలింగ్ నమోదైంది. పట్టభద్రులకు సంబంధించి 80 శాతం నమోదైంది. ఎన్నికల జోనల్ అధికారి యల్లప్ప, మండల తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి రెవెన్యూ సిబ్బందితో కలసి పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రం వద్ద సీఐ గణేష్ నేతృత్వంలో స్థానిక ఎస్ఐ రామకృష్ణయ్య 144 సెక్షన్ అమలు చేసి 25 మంది పోలీసులతో శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

▸▸ కూడేరు మండలంలో 81 శాతం పోలింగ్ జరిగినట్లు తహసీల్దార్ మధుసూదన్, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలసి బందోబస్తు నిర్వహించారు.

▸▸ వజ్రకరూరు మండలంలో పట్టభద్రులకు సంబంధించి 78.46 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 85.41 శాతం ఓటింగ్ జరిగినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. కాగా పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ కె.ఫక్కీరప్ప పరిశీలించారు.పోలింగ్ ముగిసేవరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. అదేవిధంగా గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఉరవకొండ సీఐ శేఖర్ పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

▸▸ విడపనకల్లు మండలంలో పట్టభద్రులకు సంబంధించి 83.21 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి వంద శాతం ఓటింగ్ నమోదైనట్లు ప్రోసీడింగ్ ఆఫీసర్లు శేఖర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ తెలిపారు.


రాయదుర్గం: పోలీసులపై దూసుకుపోతున్న టీడీపీ నాయకులు


శస్త్ర చికిత్స చేయించుకున్న విశ్రాంత హెచ్ఎంను పోలింగ్ కేంద్రానికి తరలిస్తున్న రెవెన్యూ అధికారులు

పట్టభద్రుల ఓట్ల వివరాలిలా..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
రాయదుర్గం నియోజకవర్గం		
రాయదుర్గం	2,930	2,326
బొమ్మనహాళ్	797	663
కణేకల్లు	1,151	912
డి హీరేహాళ్	601	498
గుమ్మఘట్ట	656	563
కళ్యాణదుర్గం నియోజకవర్గం		
కళ్యాణదుర్గం	2,930	2,315
కంబదూరు	955	759
కుందుర్పి	1,048	825
శెట్టూరు	744	601
బ్రహ్మసముద్రం	649	547
ఉరవకొండ నియోజకవర్గం		
ఉరవకొండ	2,093	1,548
వజ్రకరూర్	1,040	816
విడపనకల్లు	715	595
కూడేరు	833	679
బెళుగుప్ప	751	603

ఉపాధ్యాయ ఓట్ల వివరాలు..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
రాయదుర్గం నియోజకవర్గం		
రాయదుర్గం	235	227
బొమ్మనహాళ్	31	30
కణేకల్లు	48	46
డి హీరేహాళ్	15	15
గుమ్మఘట్ట	16	15
కళ్యాణదుర్గం నియోజకవర్గం		
కళ్యాణదుర్గం	287	273
కంబదూరు	20	20
కుందుర్పి	34	32
శెట్టూరు	22	22
బ్రహ్మసముద్రం	17	15
ఉరవకొండ నియోజకవర్గం		
ఉరవకొండ	187	173
వజ్రకరూర్	48	41
విడపనకల్లు	16	16
కూడేరు	13	11
బెళుగుప్ప	31	31


కంబదూరు: ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు


కూడేరు: చంటి బిడ్డతో ఓటు వేయడానికి వస్తున్న మహిళ


కణేకల్లు: ఓటేసేందుకు వచ్చిన వికలాంగురాలు హసీనా


కణేకల్లు: బారులు తీరిన ఓటర్లు

ఉత్సాహంగా పాల్గొన్న ఓటర్లు

కళ్యాణదుర్గం సాక్షి బృందం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నిక జరిగింది. కళ్యాణదుర్గం ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, డీఎస్పీ బి.శ్రీనివాసుల పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. పోలింగ్ కేంద్రానికి సుమారు వంద మీటర్ల దూరంలోనే ఓటర్ల సౌలభ్యం కోసం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రానికి సమీపంలోకి రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు 144 సెక్షన్ విధించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు ఏడు ఉండగా మొత్తం 6,326 మంది ఓటర్లు ఉన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఐదు పోలింగ్ కేంద్రాలుండగా 380 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పట్టభద్రుల స్థానం నుంచి 5,047 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 80 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ స్థానం నుంచి 380 మంది ఓటర్లు ఉండగా 362 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకుని 95 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు. కాగా కళ్యాణదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (నార్తు) లోని పోలింగ్ కేంద్రం 194 లో పట్టభద్రుల స్థానం నుంచి మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ప్రక్రియను జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప పరిశీలించారు.

▸▸ కంబదూరు మండలంలో పట్టభద్రులు 955 మందికి ఓటు హక్కు ఉండగా 759 మంది ఓటు హక్కును వినియోగంచుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రాజేష్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

▸▸ శెట్టూరు మండలంలో పట్టభద్రులకు సంబంధించి 80.77 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి వందశాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, ఎస్ఐ యువరాజ్ పాల్గొన్నారు.

▸▸ బ్రహ్మసముద్రం మండలంలో పట్టభద్రులకు సంబంధించి 84.28 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 88.23 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ బాలకిషన్ తెలిపారు. ఎస్ఐ, పరుశురాముడు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


కళ్యాణదుర్గంలో ఓటరు స్లిప్పులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి


బ్రహ్మసముద్రం: ఓటు వేసేందుకు వచ్చిన వికలాంగుడికి సాయం చేస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది


విడపనకల్లు: చంటి బిడ్డతో వచ్చి ఓటు వినియోగించుకున్న పట్టభద్రురాలు


బెళుగుప్ప: పట్టభద్రుల ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలికి సాయం చేస్తున్న ఆశావర్కర్లు


బొమ్మనహాళ్‌లో క్యూ కట్టిన పట్టభద్ర ఓటర్లు


గుమ్మఘట్ట: బారులు తీరిన పట్టభద్రులు


వజ్రకరూరు: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర, తహసీల్దార్ అనిల్‌కుమార్

వేదావతి హగరి కాజ్‌వేకు మహర్దశ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని వేదావతి హగరి నదిపై కాజ్‌వేకు మహర్దశ పట్టింది. బళ్లారి నుంచి బొమ్మనహాళ్ మీదుగా రాయదుర్గం, కణేకల్లు, అనంతపురం, పావగడ, బెంగళూరుకు వెళ్లే ప్రధాన అంతరాష్ట్ర రహదారి. ఉద్దేహాళ్ గ్రామ సమీపంలోని వేదావతి హగరి నదిపై ఉన్న కాజ్‌వే వాహనాల రద్దీ వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను తప్పించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదు. తాత్కాలిక మరమ్మతులు చేసినా మూన్నాళ్లకే గుంతలు తేలి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సమస్యను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి తీసుకెళ్లడంతో.. కాజ్‌వేపై సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మాటకు కట్టుబడి రూ.30 లక్షలతో ఉద్దేహాళ్ కాజ్‌వేపై సీసీ రోడ్డు నిర్మించారు. సీసీ రోడ్డు పూర్తవ్వడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. వాహనదారులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బళ్లారి నుంచి కళ్యాణదుర్గం వెళ్లే కాజ్‌వే దుస్థితి



కాజ్‌వేపై సీసీ రోడ్డు